క్లుప్తంగా

నేటి నుంచి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

ముమ్మిడివరం: ముమ్మిడివరం శివారు పల్లిపాలెం శ్రీహరి సాకేత ఆలయంలో 14వ తేదీ శుక్రవారం నుంచి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవం, తిరు కల్యాణ మహోత్సవాలు జరగనున్నాయి. ఈనెల 14న స్వామివారికి పరిపూర్ణ అభిషేకాలు, సుదర్శన హోమాలు, స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. 15న లోక కల్యాణార్థం స్వామికి కల్యాణం, భారీ అన్న సమారాధన, 16న మహా పూర్ణాహుతి, పుష్కరిణిలో చక్ర స్నానం, సూర్యనమస్కారాలు, ధ్వజారోహణ, పుష్పోత్సవం జరప నున్నట్లుగా ఆలయ నిర్వాహకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అమలాపురం రూరల్: బీఆర్ అంబేడ్కర్ 132వ జయంతి సందర్భంగా ఎ.వేమవరం మన్నానగర్ కాలనీలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ జక్కంపూడి కిరణ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా 20 మంది యువకులు రక్తదానం చేశారు. సేవా కార్యక్రమాలు నిర్వహించిన రమేష్‌ను ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, కిరణ్‌లు అభినందించారు. కార్యక్రమంలో చిత్రపు జయరాజ్, జంగా సత్యనారాయణ, గెడ్డం ఆనందరావు, వాకపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

స్వీయ రక్షణపై ప్రజలకు అవగాహన



ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరిస్తున్న ఎన్‌డీఆర్‌ఎఫ్ ప్రతినిధులు

ముమ్మిడివరం: ప్రమాదాల సమయంలో స్వీయ రక్షణ ఏవిధంగా చేపట్టాలన్న అంశంపై నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్(ఎన్‌డీఆర్‌ఎఫ్) ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించారు. ముమ్మిడివరం మండలం కమిని పంచాయతీ పరిధిలో ఇన్‌స్పెక్టర్ రాజేంద్రకుమార్ సరోజ్ నేతృత్వంలో పలు అంశాలను వివరించారు. గుండెపోటు వచ్చిన వ్యక్తి నాడిని పరిశీలించి దానికి అనుగుణంగా కుడివైపు నుంచి సీపీఆర్ చేయాలన్నారు. స్థానిక విద్యార్థులతో సీపీఆర్ ఎలా చేయాలో ప్రాక్టీస్ చేయించారు. వరదలు, తుఫాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యడ్ల రాంబాబు, గ్రామ సర్పంచ్ సలాది లక్ష్మి, సలాది రామచంద్రారావు, ఎన్‌డీఆర్‌ఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు జగ్గరాజుపేటలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి పంచాయతీ పరిధి జగ్గిరాజుపేటలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు, గుడ్‌సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుంచే రమణారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయవాడ డీసీపీ మోకా సత్తిబాబు పాల్గొంటారన్నారు.

సేంద్రియ రైతుల ర్యాలీ

అమలాపురం రూరల్: నవధాన్యాల సాగు చేద్దాం.. పుడమి తల్లిని కాపాడుదాం, రసాయన ఎరువులు వద్దు.. నవధాన్యాలు ముద్దు అంటూ నల్లమిల్లి గ్రామంలో సేంద్రియ రైతులు ర్యాలీ నిర్వహించారు. అమలాపురం డివిజన్‌లో గురువారం జరిగిన రైతుల సమీక్షలో 600 నవ ధాన్యాల కిట్లు తయారుచేశారు. నవధాన్యాల సాగు వల్ల జీవవైవిధ్యం పెరుగుతుందని ఏఈఓ ఎ.సూరిబాబు అన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, మల్లిఖార్జునరావు, అప్పారి చినవెంకటరమణ, జగదేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల బహూకరణ

తాళ్లరేవు: కోరంగి పంచాయతీ సీతారామపురంలోని రిలయన్స్ దీరూబాయి ఎర్లీ ఇంటర్‌వెన్షన్ సెంటర్(దివ్యాంగుల పాఠశాల)కు తాళ్లరేవు మండల ఎండీయూడబ్ల్యూఏ అధ్యక్షుడు పెయ్యల రమేష్ 25 కుర్చీలను బహూకరించారు. దివ్యాంగుల పాఠశాల సిబ్బంది అభ్యర్థన మేరకు రూ.10 వేలు విలువ చేసే 25 కుర్చీలను కొనుగోలు చేసి గురువారం పాఠశాలకు అందజేశారు. రమేష్‌కు పాఠశాల సిబ్బంది ఎంవీ గోపాల్, శ్రీకాంత్, స్టీవెన్, సత్తిబాబు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

గుమ్మటం ఊరేగింపు

మామిడికుదురు: ఇమామ్ హజరత్ అలీ షహదత్‌లో భాగంగా ముస్లింలు గురువారం మామిడికుదురులో మజ్లిస్ ఆలపిస్తూ గుమ్మటం ఊరేగించారు. మొల్లా పంజా నుంచి తీసిన గుమ్మటాన్ని నగరం పెద పంజీషా వరకూ ఊరేగించారు. ఈ సందర్భంగా మర్షియా ఆలపించారు. సర్కిల్ పర్వత్ అలీబేగ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పెద పంజీషాలో షహదత్ మజ్లిస్ నిర్వహించారు.

రైతుకు ప్రా'ధాన్యం'

- ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం
- ప్రభుత్వ మద్దతు ధర బస్తాకు రూ.1,545



కోతకు సిద్ధమైన వరి పంట

ఐ.పోలవరం: రబీ వరి కోతలు ప్రారంభమయ్యాయి. అధిక శాతం రైతులు యంత్రాలతోనే మాసూళ్లు చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రైతులు కనీస మద్దతు ధరకు ధాన్యం అమ్ముకునే విధంగా చేయడమే లక్ష్యంగా రైతు భరోసా కేంద్రాల్లో రెవెన్యూ, వ్యవసాయ, సహకార శాఖలు సమన్వయంతో ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పిస్తున్నారు.

90 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా

ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాల పరిధిలో రబీకి సంబంధించి 19 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. ఎకరానికి 45 నుంచి 56 బస్తాల దిగుబడి వస్తుందన్నది వ్యవసాయ శాఖ అంచనా. దీని ప్రకారం క్లస్టర్ పరిధిలో 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం సాధారణ ధాన్యం రకం 75 కేజీల బస్తా రూ.1,530, 'ఏ' గ్రేడు రకం ధాన్యం 75 కేజీల బస్తా రూ.1,545 మద్దతు ధరగా నిర్ణయించింది.

కేంద్రాల్లో నిబంధనలివీ..

కేంద్రాల్లో కొనుగోలు చేసే ధాన్యంలో మట్టి, రాళ్లు, ఇసుక వంటి వ్యర్థాలు ఒక శాతం మించి ఉండకూడదు. గడ్డి, చెత్త తప్ప, కలుపు విత్తనాలు ఒక శాతం మించి ఉండరాదు. రంగుమారిన, మొలకెత్తిన, పురుగు పట్టిన ధాన్యపు గింజలు ఐదు శాతం మించకూడదు. పరిపక్వం కాని, ముడుచుకుపోయిన, వంకర తిరిగిన ధాన్యపు గింజలు మూడు శాతం లోపే ఉండాలి. తక్కువ శ్రేణి ధాన్యపు గింజలు లేక కేళీలు ఏ గ్రేడు రకంలో ఆరు శాతం మించకూడదు. తేమ లేక నిమ్ము 17 శాతం మించకూడదు. అందుకే రైతులు ఒక రకం ధాన్యాన్ని మరో రకం ధాన్యంతో కలపకూడదు. పంట కోసిన తర్వాత ఆరబెట్టక పోతే గింజలు రంగుమారి నాణ్యత కోల్పోతాయి కనుక పూర్తిగా ఆరబెట్టిన ధాన్యాన్నే కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలి. ధాన్యంలో రాళ్లు, మట్టిగడ్డలు కలవకుండా నేలమీద బరకాలు, టార్పాలిన్లు వేసి వాటిపై నూర్పిడి చేయాలి.

> **అవగాహన కల్పిస్తున్నాం**
>
> 
>
> రైతులకు ధాన్యం కొనుగోలుపై అవగాహన కల్పిస్తున్నాం. ఆర్‌బీకే స్థాయిలో రైతులకు అవగాహన కల్పించి, ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా అమ్మకాలు చేసే విధంగా చర్యలు చేపడుతున్నాం.
>
> – ఎం.వెంకట రామారావు, ఏడీఏ, ముమ్మిడివరం

పంపుహౌస్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

ధవళేశ్వరం ఇరిగేషన్ ఎస్‌ఈతో చర్చలు



ధవళేశ్వరం వద్ద పంపుహౌస్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్, ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: ప్రజా పనుల శాఖ(పీడబ్ల్యూడీ) ద్వారా కొన్నేళ్ల క్రితం ధవళేశ్వరం నుంచి యానాం వరకు తాగునీటిని తరలించేందుకు ధవళేశ్వరం వద్ద నిర్మించిన పంపు హౌస్‌ను ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ గురువారం పరిశీలించారు. వేసవిలో యానాంకు తాగునీటి సమస్య తలెత్తకుండా నీటిని తరలించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, సహకారం గురించి ధవళేశ్వరం ఇరిగేషన్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీరుతో ఆయన చర్చించారు. ప్రస్తుతం యానాంలో ఉన్న 55 ఎకరాల తాగునీటి చెరువులో నీటిని పూర్తిస్థాయిలో నింపాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో పిల్లంక బ్రహ్మాపురి వద్ద నున్న ఫ్రెంచి కెనాల్ వద్ద క్రాస్‌బండ్ వేసుకోవడానికి అనుమతివ్వాలని కోరగా ఎస్‌ఈ అంగీకరించారన్నారు. క్రాస్‌బండ్ పనులు వేగంగా జరుగుతున్నాయని పది, పదిహేను రోజుల్లో యానాంలో ఉన్న అన్ని తాగునీటి చెరువులు నిండుతాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, ఏఈ కాళ్ల నాగరాజు, జ్యోతిరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గదుల తొలగింపుపై ఫిర్యాదు

అమలాపురం టౌన్: స్థానిక షాదీఖానా పైఅంతస్తులో ఉన్న గదులను తొలగించడంపై జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ జిల్లా బోర్డు ఇన్‌స్పెక్టర్ మహ్మద్ షఫీ ఉల్లాకు ఫిర్యాదు చేశారు. దీంతో బోర్డు ఇన్‌స్పెక్టర్ షఫీ షాదీఖానాను గురువారం పరిశీలించారు. స్థానిక జామియా మసీదు, షాదీఖానా, పీర్ల పంజా అధ్యక్షుడు మహ్మర్ షెహన్‌షా వక్ఫ్ బోర్డు నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వాటిని కూల్చుతున్నారని జిల్లా బోర్డు చైర్మన్ ఖాదర్ ఇన్‌స్పెక్టర్ షఫీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ షఫీ మాట్లాడుతూ తమకు షాదీఖానా పైఅంతస్తు గదులను కూల్చుతున్నట్లు ఎలాంటి సమాచారం లేదన్నారు. గతంలో డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో షాదీఖానా పైఅంతస్తు గదులకు నిధులిచ్చారని ఇన్‌స్పెక్టర్‌కు వివరించారు. షాదీఖానా అధ్యక్షుడు షెహన్‌షా తాను స్టేట్ వక్ఫ్ బోర్డు డైరెక్టర్ దృష్టిలో ఈ విషయాన్ని ఉంచానని... ఆయన అనుమతితోనే తొలగిస్తున్నానని తెలిపారు. ఈ విషయాన్ని తాను వక్ఫ్ బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుని వెళుతున్నట్లు బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్ షఫీ తెలిపారు.

గడప గడపకూ సంక్షేమ పథకాలు



జి.అగ్రహారంలో సంక్షేమ పథకాల లబ్ధి పత్రాలను అందజేస్తున్న మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్

- మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్
- జి.అగ్రహారంలో గడప గడపకూ మన ప్రభుత్వం

అమలాపురం రూరల్: కుల, మత, రాజకీయాలకు అతీతంగా గడప గడపకూ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. అమలాపురం రూరల్ మండలం గున్నేపల్లి అగ్రహారంలో రెండోరోజు గురువారం గడప గడపకూ కార్యక్రమం నిర్వహించారు. ఆయన గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకే నవరత్నాలు తీసుకొచ్చారన్నారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వర బాబు, వైస్ ఎంపీపీ పోలమూరి బాలకృష్ణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగబత్తుల కొండ, ఉప సర్పంచ్ గోసంగి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- రామస్వామితోట, లచ్చిరాజుచెరువు గ్రామాల్లో గడప గడపకూ..



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

కాట్రేనికోన: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. రామస్వామితోట, లచ్చిరాజు చెరువు గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. రామస్వామితోటలో ఆయన్ని స్థానిక నాయకులు గజమాలతో సత్కరించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఇంటి స్థలం లేని పేదలందరికీ రాష్ట్రవ్యాప్తంగా పట్టాలు ఇచ్చామన్నారు. నాడు-నేడుతో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టామన్నారు. విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చి డిజిటల్ క్లాస్‌లో విద్యాబోధన అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నేల కిషోర్, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ నల్లా బేబి జానకి, సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు సంసాని నాగేశ్వరరావు, నడింపల్లి సూరిబాబు, పాలెపు ధర్మారావు, సానబోయిన నాగేశ్వరరావు, జగడం బాలయ్య, కాశి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో పలువురు టీడీపీ కార్యకర్తల చేరిక

రామస్వామితోటకు చెందిన సాపే తాతారావు, పాము శివప్రసాద్, కోనాల వెంకటేష్‌లతో పాటు పలువురు టీడీపీ నాయకులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఎమ్మెల్యే పొన్నాడ సమక్షంలో పార్టీలో చేరారు.

గ్రామగ్రామాన జగనన్నే మా భవిష్యత్తు



కొమరగిరిలో నిర్వహిస్తున్న జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం



జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో సర్పంచ్ అలివేణి

ఐ.పోలవరం: ఎన్నికల వాగ్దానాలు పూర్తిగా అమలు చేసి ప్రజల మద్దతు కోరుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'జగనన్నే మన భవిషత్' కార్యక్రమం మండలంలోని కొమరగిరి, జి.మూలపొలం, ఐ.పోలవరం తదితర గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు గురువారం నిర్వహించారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు ఇంటింటికీ వెళ్లి నాడు-నేడు ప్రభుత్వ పాలనలో వ్యత్యాసాలను వివరిస్తూ ప్రజాభిప్రాయాన్ని సేకరించారు.

ముమ్మిడివరం: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి గ్రామగ్రామాన అనూహ్య స్పందన లభిస్తోంది. జగనన్నే మా నమ్మకం అంటూ ఇంటింటికీ స్టిక్కర్లు అంటించుకునేందుకు సుముఖత వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, ఎంపీపీ కోలా గంగాభవానీ, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ జగతా పద్మనాభం, కోలా బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: వైఎస్సార్ సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంతో వైఎస్సార్ సీపీ నాయకులు, గృహ సారథులు, గ్రామ సచివాలయ కన్వీనర్‌లు ఇంటింటికీ వెళ్లి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టడంతో పండగ వాతావరణం నెలకొంది. గ్రామాల్లో ప్రతి ఇంటి తలుపు, మొబైల్ ఫోన్‌లపై జగనన్నే మా భవిష్యత్తు స్టిక్కర్లు దర్శనమిస్తున్నాయి. బ్రహ్మసమేధ్యం పంచాయతీ బలుసుతిప్పలో సర్పంచ్ మల్లాడి ఏడు కొండలు, మల్లాడి ఆదినారాయణ, తిరుమాని సత్తిబాబు, ఓలేటి సతీష్ తదితర నాయకులు జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు.

తాళ్లరేవు: గురువారం జార్జిపేట పంచాయతీలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుడుపూడి శివన్నారాయణ ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పేర్ని ఆదినారాయణ మూర్తి, గ్రామ కమిటీ కన్వీనర్ రెడ్డి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మున్సిపల్ చైర్మన్ బుల్లియ్య మృతి



అమలాపురం టౌన్: అమలాపురం మాజీ మున్సిపల్ చైర్మన్ ఉంగ్రు బుల్లియ్య(73) గురువారం ఉదయం స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన 1987–92 మధ్య మున్సిపల్ చైర్మన్‌గా పని చేశారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. స్థానిక ఎర్ర వంతెన వద్ద గల బుల్లియ్య స్వగృహానికి వెళ్లి పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఏపీ అగ్రికల్చర్ మిషన్ సభ్యుడు జిన్నూరి బాబి, మాజీ ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, చిల్లా జగదీశ్వరి తదితరులు బుల్లియ్య భౌతిక కాయంపై పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు.

ఘనంగా ధనమ్మ తల్లి తీర్థం



అమ్మవారి సన్నిధిలో మంత్రి వేణు

కాజులూరు: గొల్లపాలెం, కరప మండలం కొంగోడు గ్రామాల సరిహద్దున వెలసిన శ్రీ ధనమహాలక్ష్మి (ధనమ్మ తల్లి) అమ్మవారికి తీర్థం ఘనంగా జరిగింది. జాతర సందర్భంగా రెండు గ్రామాల్లోనూ బుధవారం రాత్రి కోల సంబరాలు, గారడీ, కోయ మేళాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, గరగ నృత్యాలు ప్రదర్శించారు. గురువారం వేకువ నుంచి ఆలయాల వద్ద జాతర నిర్వహించారు. కాకినాడ, రామచంద్రపురం, మండపేట, యానాం, కోటిపల్లి తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఎండ తీవ్రతను సైతం లెక్క చేయకుండా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ కాకినాడ – కోటిపల్లి రోడ్డులో కరప మండలం గొర్రిపూడి నుంచి కాజులూరు మండలం ఆర్యావటం వరకూ రహదారి భక్తులతో రద్దీగా మారింది. సుమారు 50 వేల మంది అమ్మవారిని దర్శించుకుని ఉంటారని అంచనా వేశారు. జాతర సందర్భంగా అమ్మవారి ఆలయాలను, పరిసర ప్రాంతాలను అందంగా అలంకరించారు. నిర్వాహక కమిటీతో పాటు గ్రామస్తులు, పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యాన భక్తులకు సేవా కార్యక్రమాలు చేపట్టారు. చలివేంద్రాలు ఏర్పాటు చేసి భక్తులకు మజ్జిగ, మంచినీరు అందించారు. రాత్రి 8 గంటల నుంచి ఆలయాల వద్ద భారీ ఎత్తున బాణసంచా కాల్చారు.

ఘనంగా అంబేడ్కర్ జయంతి

యానాం: యానాంలోని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అంబేడ్కర్ 132వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించగా ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఆర్‌ఏఓ నామాడి అప్పారావు, లంక కృష్ణారావు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ భాస్కరరెడ్డి మాట్లాడుతూ అంబేడ్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఆయన భావాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు మాధవీలత, ఉమాదేవి, కె.ప్రసాద్, ప్రసాదరావు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో గురువారం సాయంత్రం అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు.

యువత ముందుకు రావాలి



శిబిరంలో రక్తదానం చేస్తున్న ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్

యానాం: రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎస్పీపీ ప్రభుత్వ కళాశాలలో అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన రక్తదాన శిబిరంలో ఎమ్మెల్యే అశోక్‌తో పాటు 103 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆర్‌ఏఓ మునిస్వామి, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు సబ్బతి లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. రూ.48.99 లక్షల ఖర్చుతో మహిళల రక్షణార్థం నిర్మించనున్న ఒన్‌స్టాప్ సెంటర్‌కు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ భూమిపూజ చేశారు. గోపాల్‌నగర్‌లో నిర్మిస్తున్న ఆయుష్ ఆసుపత్రి నిర్మాణ పనులును ఎమ్మెల్యే అశోక్ పరిశీలించారు

జగనన్న రీసర్వే స్టోన్ ప్లాంటేషన్ పరిశీలన

తాళ్లరేవు: మండల పరిధిలో జరిగిన జగనన్న రీసర్వే కార్యక్రమంలో స్టోన్ ప్లాంటేషన్ నూరుశాతం పూర్తయిన గ్రామ పంచాయతీలను డీఎల్‌పీఓ వై.అమ్మాజీ గురువారం పరిశీలించారు. తాళ్లరేవు మండల పరిధిలోని నీలపల్లి, జార్జిపేట రెవెన్యూ పరిధిలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ పుంత రహదారుల్లో సరిహద్దులు నిర్ధారించి రాళ్లు పాతే కార్యక్రమం పూర్తయిందని చెప్పారు. అనంతరం ఎంఎల్‌కే నగర్‌లోని సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జార్జిపేట, నీలపల్లి సర్పంచ్‌లు పేర్ని ఆదినారాయణ మూర్తి, చిట్టూరి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

హామీ నెరవేర్చాలంటూ గ్రామస్తుల ధర్నా



ఏటిమెరక ఓఎన్‌జీసీ సైటుకు వెళ్లే మార్గంలో ధర్నాకు దిగిన గ్రామస్తులు

ఉప్పలగుప్తం: తమ గ్రామ అభివృద్ధిని పట్టించుకోవడం లేదంటూ ఉప్పలగుప్తం పంచాయతీ ఏటిమెరక గ్రామస్తులు ఓఎన్‌జీసీ సైటుకి వెళ్లే మార్గంలో గురువారం ధర్నా నిర్వహించారు. మార్చి 31లోగా గ్రామాభివృద్ధికి పనులు ప్రారంభిస్తామని ఓఎన్‌జీసీ అధికారులు కలెక్టర్ హిమాన్షుశుక్లా, సర్పంచ్ కడిమి చిన్నవరాజు సమక్షంలో కుదుర్చుకున్న ఒప్పందాన్ని పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏటిమెరక ప్రాంతంలో పని ముగించుకుని వెళుతున్న గోపవరం యూనిట్ భారీ కంటైనర్ వాహనాలు, యంత్రాలన్నింటినీ ముందుకు కదలకుండా రోడ్డుకి అడ్డంగా టెంట్ వేసి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, ఎస్‌ఐ జి.వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.సురేష్, ఓఎన్‌జీసీ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్తులతో చర్చించారు. గ్రామానికి రూ.23.65 లక్షల మేర సీఎస్‌ఆర్ నిధులు కేటాయించారని తహసీల్దార్ వెంకటేశ్వరి, కంపెనీ హెచ్‌ఆర్ సీఎస్‌ఆర్ ఇన్‌చార్జి జాన్‌వెస్లీ ఒప్పంద పత్రం లిఖిత పూర్వకంగా ఇవ్వజూపినా గ్రామస్తులు ఒప్పుకోలేదు. ఉదయం 9 గంటల నుంచి జరిగిన ధర్నాను గ్రామ సర్పంచ్ చిన్నవరాజు హామీతో మధ్నాహ్నం 3 గంటలకు విరమించారు.